## క్లుప్తంగా

### ట్రినిటి పాఠశాలలో గోరింటాకు ఉత్సవం



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాసులపల్లిలోని ట్రినిటి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు గోరింటాకు ఉత్సవం ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ బాపురెడ్డితో పాటు ఉపాధ్యాయులు మౌనిక, భూదేవి, గీత, మంగ, సౌందర్య, శ్యామల, సువార్త, సమ్మయ్య, సతీశ్, రామస్వామి పాల్గొన్నారు.

### తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: కాలనీలకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో తడి, పొడి చెత్తపై కాలనీవాసులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భారీ వర్ష సూచన ఉన్నందున పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వార్డు ఆఫీసర్ నారాయణ, వనజ, బిల్ కలెక్టర్ కృష్ణ, శానిటేషన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించాలి

సుల్తానాబాద్: మేస్త్రీలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ బషీరోద్దీన్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో గురువారం మండలంలోని మేస్త్రీలు, సుతార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యసాధనకు సుతార్లు సహకరించాలని కోరారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మేస్త్రీలు పనిచేసి ఇల్లును లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఎంపీవో సమ్మిరెడ్డి, ఎస్సై అశోక్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

### హామీల అమలులో విఫలం

పెద్దపల్లిరూరల్: రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ ఆరోపించారు. బీజేపీ జిల్లా నాయకులు జంగ చక్రధర్‌రెడ్డి, పల్లె సదానందంతో కలిసి గురువారం కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న రుణమాఫీ అమలు చేయాలని, పంటలకు బోనస్ చెల్లించాలని, రైతుభరోసా ఎకరానికి రూ.15వేలుగా ఇవ్వాలని, కౌలురైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అక్కెపల్లి క్రాంతి, బెజ్జంకి దిలీప్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, కొండల్, కాసనగొట్టు విజయ్, వెంకటేశ్, కరుణాకర్, భాస్కర్ ఉన్నారు.

### ఘనంగా దత్తమాల మంత్ర హోమం



ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం దత్తమాల మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

### ఎరువుల షాపులు తనిఖీ

ఎలిగేడు: మండలంలోని ఎలిగేడు, ధూళికట్ట సహకార సంఘాలు, మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి తనిఖీ చేశారు. అవసరానికి అనుగుణంగా యూరియా విక్రయించాలని సూచించారు. రైతులు పంట కాలానికి సరిపడా యూరియాని ఒకేసారి కాకుండా, యూరియా అవసరం ఉన్నప్పుడు మాత్రమే తీసుకెళ్లాలన్నారు. యూరియాకు బదులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను ఒకసారి పిచికారీ చేయాలన్నారు. మండలంలో సహకార సంఘాలు, ఎరువుల షాపుల్లో కలిపి 4200బస్తాల వరకు యూరియా స్టాకు ఉన్నట్లు ఏవో వెల్లడించారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో విద్యుత్‌స్తంభాల మరమ్మతు శుక్రవారం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లి, ఇండేన్‌గ్యాస్ గోదాం, బీసీ హాస్టల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

# భూ సమస్యలకు పరిష్కారం చూపండి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



భూ సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: భూసమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ ఆఫీసును సందర్శించి పెండింగ్ లో ఉన్న వివరాలపై ఆరా తీశారు. తహసీల్దార్ రాజయ్య, డీటీ విజేందర్, సిబ్బంది ఉన్నారు.

**ఆయుష్, జనరల్ ఆసుపత్రుల్లో సేవలందాలి**

జిల్లా ప్రభుత్వాసుపత్రితో పాటు ఇదే ఆవరణలో ఉన్న ఆయుష్, యునాని ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. గురువారం ఆసుపత్రులను సందర్శించి కొత్త భవన పనుల పురోగతిని తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడేవారికి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్యమందించాలని సూపరింటెండెంట్ శ్రీధర్‌ను ఆదేశించారు.

**సర్వేయర్ పరీక్షలు పకడ్బందీగా జరగాలి**

జీపీవో లైసెన్సు సర్వేయర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వేణుతో కలిసి సమావేశమై మాట్లాడారు. మంథని జేఎన్‌టీయూ పరీక్షా కేంద్రానికి ప్రశ్నాపత్రాల తరలింపు బందోబస్తు నడుమ జరపాలన్నారు. జిల్లాలో 29మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**తాగునీటి సరఫరాపై సమీక్ష**

తాగునీటి సరఫరాకు సంబంధించి పెండింగ్ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మిషన్‌భగీరథ ఇంట్రా పనుల పురోగతిపై ఆరా తీసి పలు సూచనలిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మరమ్మతు పనులకు రూ.92లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈఈ పూర్ణచందర్ తదితరులున్నారు.

**ఇందిరమ్మ లబ్ధిదారులకు సాయం**

ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు జిల్లా అధికార యంత్రాంగం సహకారం అందిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ సామగ్రితో పాటు మేస్త్రీలకు చెల్లించే చార్జీలు, సెంట్రింగ్ చార్జీలను నిర్ణయించారు. 400 చదరపు గజాల ఇంటికి రూ.1,55,000, 600 చదరపు గజాల ఇంటికి రూ.2,20,000 ఖరారు చేశామన్నారు. ఒక్కో ఇటుక రూ.5.50గా, ఇసుక కూడా చౌకగానే అందించేలా ధరలు నిర్ణయించినట్లు వివరించారు. సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలన్నారు.

**వెయ్యిమంది మహిళలకు ఉపాధి**

జిల్లా మహిళా స్వశక్తి కేంద్రం ద్వారా వచ్చే మార్చి నాటికి కనీసం వెయ్యిమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో బాలికా చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి రాగా ల్యాప్‌టాప్‌తో సమానంగా పనిచేసే ట్యాబ్‌లను సమకూర్చారు. కోఆర్డినేటర్ అరుణ, కౌన్సిలర్ సంధ్య, సుచరిత, సమత ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్

రామగుండం: కాంగ్రెస్ ప్రజాపాలనపై క్షేత్ర స్థాయిలో ప్రజల స్పందన తెలుసుకునేందుకు గురువారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ వినూత్న కార్యక్రమాన్ని తలపెట్టారు. అంతర్గాం మండల పరిధిలోని ఆయన స్వగ్రామం మద్దిర్యాలతో పాటు ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్, పొట్యాల, విసంపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా అనే విషయమై నేరుగా ప్రజలతో మాట్లాడుతూ సమాధానాలు రాబట్టారు. మద్దిర్యాలలో పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలిస్తూ లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రజల నుంచి మంచి స్పందన రావడంపై సంతృప్తి చెందారు. తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్, ఎంపీడీవో బైరి వేణుమాధవ్, కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు



మొక్క అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో ఆయనను కలిసి మొక్క అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, రాజమల్లయ్య ఉన్నారు.

## ఐటీ రంగాన్ని అగ్రగామిగా నిలిపిన కేటీఆర్



కేక్ కట్ చేస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: ఐటీ రంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన యంగ్ డైనమిక్ లీడర్ కేటీఆర్ అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక జయదుర్గాదేవి, ఆటో యూనియన్ వద్ద కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జయదుర్గాదేవి ఆలయంలో పూజ నిర్వహించిన అనంతరం మొక్కలు నాటారు. నాయకులు కౌశిక హరి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి, జనగామ కవిత సరోజినీ, పాముకుంట్ల భాస్కర్, గోపు ఐలయ్యయాదవ్, మెతుకు దేవరాజు, మారుతి, జిట్టవేన ప్రశాంత్, నూనె కొమురయ్య, రత్నాకర్, ముద్దసాని సంధ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో జరిగిన పోటీల్లో పెద్దపల్లి ట్రినిటి విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సాత్విక్, అశ్విత్‌ను గురువారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

**బనకచర్లతో రాష్ట్రం ఎడారిగా మారుతుంది**

గోదావరిఖనిటౌన్: బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రం ఎడారిగా మారుతుందని బీఆర్‌ఎస్వీ రామగుండం కోఆర్డినేటర్ కొలుగూరి సాయికుమార్(చింటు) అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బనకచర్ల పాజెక్టుతో రాష్ట్రానికి జరిగే నష్టంపై గురువారం అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. బీఆర్‌ఎస్వీ నాయకులు పర్లపల్లి అభిషేక్, బండి ప్రదీప్, హరికిల్ల కళ్యాణ్, మణి, అభినవ్, రాకేశ్, రతిక్ పాల్గొన్నారు.

**ఘనంగా బోనాల ఉత్సవాలు**

గోదావరిఖనిటౌన్: బోనాల ఉత్సవాన్ని నగరంలోని 38వ డివిజన్ పరిధిలో బుధవారం రాత్రి ఆర్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## నిరుపేద ఆటో కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న హరీశ్‌రెడ్డి

గోదావరిఖని: కేటీఆర్ బర్త్‌డే గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా నిరుపేద ఆటో కుటుంబాలకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరీశ్‌రెడ్డి 19 కుటుంబాలకు తలా రూ.10వేల చొప్పున రూ.1.90లక్షలు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. నాయకులు తస్నీమ్‌బాను, జాహిద్‌పాషా, రమణారెడ్డి, వంశీకృష్ణ, సాయి, గణేశ్, ఉదయ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి**

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈవో మహేశ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో హుజూరాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నరెడ్ల వీరలక్ష్మి సహకారంతో గురువారం విద్యార్థులందరికీ టైలు, బెల్టులు అందజేశారు. స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, హెచ్‌ఎం రాజారాం, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుమలత పాల్గొన్నారు.

**• కలుపు, పురుగు మందుల వాడకంపై అవగాహన**

ఎలిగేడు: మండలకేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో కోర్టేవ అగ్రిసైన్సు వారి ఆధ్వర్యంలో కలుపు, పురుగు మందుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంపెనీ జెడ్‌బీఎం సందీప్‌రెడ్డి, టీబీఎం సంతోష్‌కుమార్ మాట్లాడారు. రైతులు సస్యరక్షణ చర్యలు, కలుపు యాజమాన్యంలో వాడే కొరియన్, నోవిక్సిడ్ నోవే లెక్టు మందులు వాడుతూ పెట్టుబడి తగ్గించుకునే పద్ధతులపై అవగాహన కల్పించారు.

**• సీనియర్ సిటిజన్స్ కార్డులు జారీ చేయాలి**

జ్యోతినగర్: సీనియర్ సిటిజన్స్‌కు ప్రభుత్వపరంగా అందించే సీనియర్ సిటిజన్స్ గుర్తింపు కార్డులను వెంటనే జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ రామగుండం విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సట్టు ముత్యాలు, ఉపాధ్యక్షుడు దుర్గం నరసయ్య ఒక ప్రకటనలో కోరారు. జిల్లా సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో జారీ చేసే కార్డులను కొంతకాలంగా జారీ చేయడం లేదని ఆరోపించారు. కార్డుల జారీ విషయంపై కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు.

**• సమస్యలు పరిష్కరించాలి**

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పక్షాన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

**• తహసీల్దార్‌కు వినతి**

కమాన్‌పూర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ వాసంతికి గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కమిటీ నాయకులు సదయ్య, రాజు, మల్లేశ్వరరావు, రమేశ్, నంబయ్య, శంకర్, భరత్ కుమార్ ఉన్నారు.

**• మందకృష్ణ మాదిగ సభకు తరలిరావాలి**

ఓదెల: పెద్దపల్లిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే దివ్యాంగుల పోరాటసమితి మహాసభకు అధికసంఖ్యలో తరలిరావాలని దివ్యాంగుల పోరాటసమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఐరెడ్డి నారాయణరెడ్డి గురువారం కోరారు. మహాసభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దివ్యాంగులు, ఆసరా పింఛన్‌దారులు హాజరుకావాలన్నారు. నాయకులు అమీన్ బేగ్, రాసపల్లి రవికుమార్, పల్లె సుమన్ ఉన్నారు.

**• విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

జ్యోతినగర్: విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ రామగుండం మండల తహసీల్దార్‌కు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రామగుండం మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు స్నేహలత, కళావతి, చంద్రశేఖర్, శ్యామల, శారద, శ్రీశైలం పాల్గొన్నారు.

**• పోస్టర్ ఆవిష్కరణ**

రామగుండం: ఈనెల 27న జరిగే పీవైఎల్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, కార్యదర్శి బండి అశోక్ కోరారు. గురువారం కౌన్సిల్ వాల్‌పోస్టర్‌ను అంతర్గాం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కట్టా తేజేశ్వర్, అందె సతీశ్, ఆడెపు రాజు, సంతోష్, టీయూసీఐ ఆడెపు శంకర్, హన్మంతు ఉన్నారు.

**• ఆర్థిక చేయూత**

జూలపల్లి: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న నిరుపేద మిత్రుడు చనిపోవడంతో, అతని కుటుంబానికి చేయూత అందించారు తోటి మిత్రులు. మండల కేంద్రానికి చెందిన వేయిగండ్ల రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా 1993–94లో రవితో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న తోటి మిత్రులు రూ.17వేలు మిత్రుడి భార్య రజితకు గురువారం అందజేశారు. మహేశ్, గంగయ్య, లక్ష్మన్, చందు, కొమురయ్య ఉన్నారు.

**• పరామర్శ**

రామగుండం: గోలివాడ శ్రీసమ్మక్క, సారలమ్మ జాతర వ్యవస్థాపక అధ్యక్షుడు, గోలివాడ గ్రామానికి చెందిన ఆవుల చంద్రయ్య ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు గోపు అయిలయ్య యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బందారపు బుగ్గరాములుగౌడ్ తదితరులున్నారు.

## గంజాయి రవాణాదారులకు జైలు, జరిమానా

గోదావరిఖని: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరికి ఐదేళ్ల కఠినకారాగార శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి సునీత తీర్పునిచ్చినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. వివరాలు.. 2017లో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన ప్రసన్‌జిత్‌రాయ్, కమలేశ్‌గోల్డర్‌ను ఆపి బ్యాగులను చెక్ చేయగా ఒక్కొక్కరివద్ద 5కిలోల చొప్పున 10కిలోల గంజాయి దొరికింది. అప్పటి వన్‌టౌన్ సీఐ కృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. జడ్జి కేసు పూర్వపరాలు పరిశీలించి, నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడటానికి కృషి చేసిన అప్పటి సీఐ, ప్రస్తుత ఏసీపీ కృష్ణ, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఏసీపీ రమేశ్, డీసీపీ కరుణాకర్‌ను సీపీ అంబర్‌కిషోర్‌ఝా అభినందించారు.

## మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న రవీందర్

రామగుండం: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని బర్మా, శ్రీలంక, కాందీశీకుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్ గురువారం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. టెక్స్‌టైల్ సొసైటీకి చెందిన భూముల్లో వెయ్యి కార్మిక కుటుంబాలకు జీవనోపాధి కల్పించి, నివాస స్థలాలకు పట్టాలు జారీ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. సంఘం ప్రతినిధులు సాదనాల మోహన్‌రావు, శోభన్‌బాబు ఉన్నారు.



రామగుండం: కార్పొరేషన్ 28వ డివిజన్ అబాది రామగుండంలో ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులు రూ.6లక్షలతో ఆర్వో ప్లాంటుతో పాటు రూ.14లక్షల నిధులతో హిందూ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి గత మే 7న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు శంకుస్థాపన చేయించారు. అబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం పక్కనే ఆర్వో ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించిన అధికారులు కొన్నిరోజులు పనులు చేపట్టారు. ప్రస్తుతం నెలరోజులుగా పనులు నిలిచిపోయాయి. కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ స్పందించి పనులు సత్వరమే పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



పెద్దపల్లిరూరల్: జెండా చౌరస్తాలో..

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కోల్‌సిటీ/జూలపల్లి/రామగుండం/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/పాలకుర్తి/ఎలిగేడు/ముత్తారం/ఫెర్టిలైజర్‌సిటీ/రామగిరి/ధర్మారం/ఓదెల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను గురువారం పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. టపాసులు కాల్చారు. సర్కారు హాస్పిటళ్లలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమాల్లోని చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టి అన్నదానం చేశారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

## స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: ఆంధ్రజల దోపిడికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంపై కార్యకర్తలు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో గురువారం పట్టణ మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచేలా పని చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సమన్వయ సంఘం జిల్లా మాజీ కన్వీనర్లు కాసర్ల అనంతరెడ్డి, పాల రామారావు, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, సూర శ్యామ్, సంపత్, మండల కన్వీనర్లు రాజ మల్లయ్య, భూమేశ్, పట్టణ అధ్యక్షుడు గుణపతి, నాయకులు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, శివ, సర్వేశ్, నారాయణ, కుమార్, శంకర్, దయాకర్, మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, అరుణ్, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపిస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: ఆషాఢ మాసంలో మహిళలు వైభవంగా జరుపుకునే గోరింటాకుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**అనారోగ్యంతో మృతి.. నేత్రదానం**

కోల్‌సిటీ: గోదావరిఖని ఫైవింక్లయిన్ ఏరియాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో సపోర్టింగ్ స్టాఫ్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కొత్తపల్లి రమేశ్(44) అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందాడు. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన రమేశ్ గురువారం ఉదయం వాంతులు, కడుపునొప్పితో ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నేత్రదానంపై మృతుని కుటుంబానికి సదాశయ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ప్రతిని ధులు అవగాహన కల్పించారు. మృతుని నేత్రాలు దానం చేయడానికి తండ్రి కనకయ్య, సోదరులు శంకర్, సురేశ్, సోదరి జ్యోతి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ మృతుని నేత్రాలు సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ రాజేందర్ అభినందన పత్రం అందజేశారు.

## జాతీయ కరాటే పోటీలకు మంథని విద్యార్థులు



విద్యార్థులతో కరాటే శిక్షకులు

మంథని: మంథనికి చెందిన జపాన్ షిటోరియా సికోకాయ్ కరాటే విద్యార్థులు జాతీయ కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరాటే శిక్షకులు కావేటి సమ్మయ్య తెలిపారు. వచ్చే నెల 7 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో నాలుగు రోజుల పాటు జరిగే 11 నుంచి 17ఏళ్ల లోపు కటా, కుమితే విభాగంలో ఎండీ తహ హాసిన్ తైబా, బండారి మణికంఠ, పోగుల శివ సాకేత్, మారేడుగొండ రిషి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

## ఆలయాల పరిసరాలు శుభ్రం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని గుడి మిట్టపల్లి రాజరాజేశ్వర ఆలయం వద్ద మున్సిపల్ కమిషనర్ రమేశ్ కార్మికులతో శుభ్రం చేయించారు. గురువారం పలు ఆలయాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన మున్సిపల్ కమిషనర్ కార్మికులతో శుభ్రం చేయించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ప్లాస్టిక్ విక్రయం ద్వారా పంచాయతీకి ఆదాయం

ఓదెల: మండలంలోని హరిపురం గ్రామపంచాయతీలో సేకరించిన ప్లాస్టిక్‌ను అమ్మడంతో వచ్చిన రూ.1,153ను కార్యదర్శి భాస్కర్ జీపీ ఖాతాలో జమచేశారు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు కార్యదర్శిని అభినందించారు.